# అభిప్రాయ భేదం!

సీతప్ప జైలునుంచి విడుదలయి యింకా అయిదు రోజులు కాకుండానే అప్పుడే ఆకలి ప్రారంభమయింది.

సీతప్ప ఆకలి అన్నపానాదులతో తీరేదికాదు.

మంచిభోజనం చెయ్యాలని, 1702 మార్కు గ్లాస్కో పంచెలు కట్టుకోవాలని, మంచి బీడీదమ్ము పట్టాలనీ, రెండో ఆట సినీమాచూసి రిక్షాలో ఊరంతా తిరిగి రావాలని — యిలాంటికోరికలు ఎన్నో నిద్రమేల్కొన్నప్పుడు సుషుప్తిలో వున్న అతని శక్తులన్నీ ఒక్కసారి వొళ్ళు విరుచుకులేచి చుట్టూ వెదుకుతాయి. ఆ వెదుకులాటలో పట్నంలోని ధన వంతుల మేడలూ, వాళ్ళ యినప్పెట్టెలూ, ఫ్యాక్టరీల పెరటి గోడలూ రైల్వే గిడ్డంగుల వాచర్ల చిరునవ్వులూ యివన్నీ సినీమాలాగ కళ్ళముందు నిలుస్తాయి. ఇదిగో, వీటితో అవసరం కలగడమే ఈ "ఆకలి" వేయడమంటే—

ఇక అప్పుడా ఆకలికి తిరుగులేదు. బ్రహ్మరుద్రులు అడ్డువచ్చినా మర్నాడు పత్రికల కడుపునిండా వార్త ఒకటి సిద్ధం కావలసిందే!

సీతప్పకి ఓ నమ్మకం వుంది.

ఈ ప్రపంచంలో మనిషైపుట్టినవాడికి తినడానికి తిండీ, ఉండడానికి వసతీ, కట్టుకోడానికి బట్టా అవసరమనీ, వీటిని నయాన్నో భయాన్నో సంపాదించుకొనే హక్కు ప్రతివ్యక్తికీ

ఉన్నదనీ - అతని సిద్ధాంతం. వీటిఅగత్యం కలిగినప్పుడు ఈ సిద్ధాంతాన్ని మొదట "నయాన్న" అమలులో పెట్టజూశాడు. అప్పట్లోనే ఆఫీసుల్లో ఉద్యోగాల్లేవని చౌకీదార్ల గెంటింపులూ, వరహాల చెట్టిలాంటి షాహుకార్ల యీసడింపులూ, హోటళ్ళలో డబ్బులివ్వలేనప్పుడు వీపుమీద దరువులూ అనుభవించాడు. తర్వాత తర్వాత ఈ సిద్ధాంతాన్ని భయాన్న అమలు జరపడం ప్రారంభించాడు.

అయితే సీతప్ప ఎన్నడూ ఎవరి ప్రాణాలూ తీయలేదు. ఎవరిమీదా చెయ్యి చేసుకోలేదు. అసలు సీతప్పని చూస్తే అలాంటి పనులు చెయ్యగలవాడిగా కనిపించడు. దొంగలందరూ (అలా పిలిస్తే అతనికి కోపం వస్తుంది!) వేసుకొనే పట్టు చారల బనీను, నల్లటి నిక్కరూ, కోర మీసాలూ, బుగ్గమీద పెద్ద పుట్టుమచ్చో లేక కత్తిగంటో, ఎర్రబడిన తాగుబోతు కళ్ళు, చెవిలో సగంకాల్చిన బీడీముక్కా--యిలా కనిపించాడు. పసిపిల్లలుకూడా అతన్ని చూడగానే చేతులుజాపి బుజం మీదికి ప్రాకేంత ప్రసన్నంగా వుంటాడు. ఎప్పుడూ సన్నటి మల్లు పంచె, సిల్కు లాల్చీ, మెడలో సన్నటిబంగారం గొలుసు (ఒకొక్కప్పుడు "ఆకలి" తీరే అవకాశం లేకపోతే తాకట్టు పెట్టడానికి) నున్నటి, గుండ్రటి ముఖం, యిప్పుడిప్పుడే పల్చబడుతున్న జుత్తూ, ఎప్పుడూ కనుబొమలమధ్య ఎర్రగా మెరిసే బొట్టూ - యిదీ అతని స్వరూపం. చిరునవ్వు నవ్వితే నిండుగా, నమ్మకంగా కనిపిస్తుంది. అతను జీవితంలో ఎన్నడూ తాగలేదు. అతనిదగ్గర కత్తులూ కటార్లూ ఎవరూ ఎన్నడూ చూడలేదు. ఎవరినీ పల్లెత్తుమాట అనగా వినలేదు.

ముష్టివాడు చెయ్యిచాస్తే పావలాకి తక్కువ-జేబులోంచి తీసిన సందర్భం ఎవరికీ తెలీదు.

చూసినవాళ్లు "డబ్బంటే అంత నిర్లక్ష్యమేమిట్రా సీతప్పా!" అంటే—

వాళ్ళ తెలివితక్కువతనాన్ని క్షమించినట్టు నవ్వి - "మనకి నిర్లక్ష్యంగా తోచే విషయం వాడికి జీవనాధారం బాబూ. మీకు పనికిరానివెన్నో నా బ్రతుకుని నిలబెట్టే భాగ్యాలు కావచ్చు" - అంటాడు. తనకంటే పెద్దవాళ్ళని "బాబూ" అనకుండా మాట్లాడడు. పోలీసువాళ్ళనీ, జైలు వార్డన్లనీ మాత్రం "సార్" అనడం అలవాటు చేసుకున్నాడు. తీరిక వేళల్లో పత్రిక చదువుతుంటాడు. సమకాలీన రాజకీయాలుకూడా తెలుసుకొంటాడు. అప్పుడప్పుడు దేవాలయానికి వెళ్ళడంకూడా కద్దు. అతనికి వెంకటేశ్వరుడంటే మహాభక్తి. శనివారాలు రాత్రి భోజనం చెయ్యడు. మరి యింత మెత్తటివాడు, దొంగతనం ఎలా చెయ్యగలడా అని కొందరికి అనుమానంవస్తే అది చాలా పొరపాటని చెప్పకతప్పదు.

మన జాతీయోద్యమంలో - పరమపావనలూ, దైవభక్తులూ, సదాచారసంపన్నులూ-వీరోచితంగా పోరాడి తమ ప్రాణాల్ని ధైర్యంగా ఒడ్డలేదా? వాళ్ళంతా వెనుకంజ వేశారా? సీతప్పకి తన బ్రతుకూ ఒక ఉద్యమంలాంటిదే.

"ఈ సమాజంలో ప్రతివాడికీ కనీసపుకోర్కెలు తీర్చుకొనే హక్కువుంది. దానికెవరూ అడ్డురావడానికి వీల్లేదు. అడ్డువచ్చినవాళ్ళకి సూటిగానే - కాని వీలయినంత మెత్తగా బుద్ధిచెప్పి - తమ హక్కుని నిలబెట్టుకోవాలి" - అందుకనే

సీతప్ప ఎంత ధనవంతుల యిళ్ళకి వెళ్ళినా లక్షలు దోచుకోలేదు. తనకి కావలసినంతే తీసుకొన్నాడు. ధాన్యపుగోదాంలో బస్తాలు బళ్ళకెక్కించుకోలేదు. తనకు సరిపడే ఆహారాన్నే తెచ్చుకున్నాడు. తను చేసేపని చాలా నీతివంతమయినదనీ, ఒక నియమానికి కట్టుబడి, ఒక సిద్ధాంతంకోసం జరిపే పోరాటమేనని అతనికి విశ్వాసం. అందుకనే ఈ చర్యలు అతనిలో కాఠిన్యాన్ని కలిగించలేదు. పైగా నయాన్న తన కోర్కెలు తీర్చలేని ఈ సమాజం ఆఖరికి భయాన్న తీర్చక తప్పలేదని ఈ సమాజంమీద అతనికి సానుభూతి వుంది. అందుకనే ఆకలిలేని సందర్భాలలో అతను చాలామంది ఆకలిని తీర్చాడు. చాలా బీదవిద్యార్థులకి సహాయంచేశాడు. డబ్బుకోసం శరీరాన్నమ్ముకొన్నా చాలామంది కిరాయి మనుషులకి మందిప్పించి కొత్త ప్రాణంపోశాడు.

అతను తన లక్ష్యసాధనకు (అంటే మన భాషలో - దొంగతనానికి) బయలు దేరేరోజు కార్యక్రమం చాలా విచిత్రంగా వుంటుంది. ఆ రోజు ఒక పూట భోజనం చెయ్యడు. ఉపవాసం ఏకాగ్రతను పెంచుతుందని అతని నమ్మకం. ఎవరితోనూ ఎక్కువ మాట్లాడడు. తను చేస్తున్నపని ఒక సమాజానికి పట్టిన కుళ్ళును వదిలించడానికన్న ఉద్దేశాన్ని పదే పదే గుర్తుతెచ్చుకొని గాలిపీల్చిన బెలూనులాగ రొమ్ము ఉబ్బించుకొని ఉద్రేకాన్ని పూరించుకొంటాడు. ఒకరిద్దరికి అతి ఉదారంగా దానాలు చేస్తాడు. మధ్యాహ్నందగ్గర్నుంచి అర్ధరాత్రి వరకూ తన ఆయుధాల్ని పదును పెట్టుకుంటాడు. ఆ ఆయుధాలు సీతప్ప నాలుగేళ్ళు అవిరళకృషితో రూపొందించు

కున్నవి. ఏ పరికరంతో ఈ పని జరిగిందో పోలీసులకు అంద నంత విచిత్రంగా అతనిదగ్గరున్న పరికరాలు పని జరిపించుకు పోతాయి చాలా వ్యయప్రయాసలకోర్చి వాటిని తయారు చేయించుకొన్నాడు. వాటిముందు కాంక్రీటుగోడలు ఆగలేదు. ఇనుపతలుపులు తలవంచాయి. స్టీలు బీరువాలు వెన్నయి పోయాయి. ఇనప్పెట్టెలు తెల్లబోయాయి. అతను దొంగతనం చేసిన తీరునిచూసి చాలామంది, ఆఖరికి డబ్బు పోగొట్టుకున్న వాళ్ళుకూడా విచారాన్ని మరచిపోయి, క్షణకాలం ఆశ్చ ర్యాన్నీ, ఆశ్చర్యాన్నిమించి మనస్సులో అతనికి అభినందనల్నీ తెలుపుకున్నవాళ్ళున్నారు.

సీతప్ప పనితనంమీద ఇనస్పెక్టరు వెంకోబారావుకి యిప్పటికీ ఆశ్చర్యమే. ఆ పరికరాల్ని చేజిక్కించుకొందామని శతధా ప్రయత్నించాడు. సీతప్పని చాలాసార్లు జైలుకు పంపిం చాడు కాని పరికరాలు చేతికి చిక్కలేదు. ఎక్కడ దాచావని సీతప్పని హింసిస్తే లాభంలేదని వెంకోబారావు ఎప్పుడో గ్రహించాడు. కొడితే భగవంతుణ్ణి దర్శిస్తున్న ప్రహ్లాదుడిలాగ చిరునవ్వుతో శరీరాన్ని అప్పగించి - కళ్ళు మూసుకు నిలబడ తాడు సీతప్ప. కొట్టినకొద్దీ అతనిలో ఆత్మశక్తి పెరిగిపోతూం టుంది. పోనీ అతనికి ఏ ఉరిశిక్షో యావజ్జీవకారాగారమో వేయించాలంటే అంతపెద్ద నేరాలు ఎప్పుడూ చెయ్యడు సీతప్ప-అతని జైలుశిక్ష ఏ పరిస్థితుల్లోనూ పదినెలలు మించ లేదు. జైలులోకూడా అతను నలుగురికీ తలలో నాలిక అవు తాడు. నలుగురి ఖైదీలకంటె మరి పదడుగుల గోడకి యిటు కలు పేరుస్తాడు. ఇరువై కిలోల బంగాళాదుంపలు ఎక్కువ

పండిస్తాడు. అతనిచేత కాళ్ళు పట్టించుకోని వార్డన్ లేడంటే అతిశయోక్తి కాదు.

"ఇంత మంచివాడివి, ఇంత పని మంతుడివి, ఇలాంటి పనులు చేస్తావెందుకు సీతప్పా?" అని జైలర్లు ఎప్పుడన్నా అడిగితే_

జీవిత రహస్యాన్ని ఆపోశనపట్టిన మనిషిలాగ నవ్వి "నేను మంచివాడినని మీకు తెలియడానికి ఒక చెడపని చేసి జైలుకి రావలసి వచ్చింది సార్. జైల్లో నేను మంచిపని చేస్తున్నానని బయటచెప్తే ఎవరన్నా ఉద్యోగం యిస్తారా సార్?" అని ఒక సవాలు విసిరేవాడు. ఇక మాటలాడలేక జైలర్లు ఊరుకొనేవారు.

ఈసారి జైలునుంచి విడుదలవుతున్న రోజున ఏదో పని మీద ఇనస్పెక్టరు వెంకోబారావు అటువేపు వచ్చాడు. సీతప్పని చూడగానే పాతస్నేహితుణ్ణి చూసినట్టు చిరునవ్వుతో పలకరించాడు.

"ఏరా సీతప్పా, బయటికి వస్తున్నావా?" అన్నాడు - "అలా షికారుకి పోదామా?" అన్నట్టుగా

"మరేం సార్" అన్నాడు సీతప్ప.

"ఈసారయినా బుద్ధిగా బ్రతుకు"

నవ్వాడు సీతప్ప - "ఎప్పుడూ బుద్ధిగానే ఉంటున్నాను సార్. అయితే నాబుద్ధి వేరు-మీబుద్ధి వేరు".

అదో పెద్ద జోక్‌లాగ పగలబడినవ్వి, పక్క ఇనస్పెక్టరుతో-'యూసీ- వీడు చాలా తెలివయిన థీఫ్' అని మురిసి

పోయాడు వెంకోబారావు, ఆ రహస్యాన్ని మొదటిసారిగా తనే కనుక్కొన్నట్టు.

ద్వారం దాటబోతూంటే బుజంమీద చెయ్యేసి ఆపి "ఇప్పటికైనా నిజం చెప్పరా? నువ్వేనా ఆ వరహాలచెట్టి యింటిలో దొంగతనం చేసింది?"

"ఏ వరహాలచెట్టి యింటిలో?" అన్నాడు ఏమీ ఎరగనట్లు.

"తెలీదా నీకు?"

"అసలా చెట్టి ఎవరో తెలీదు"

"పోనీ, పాపాలాల్ యింటిలో?,

"ఏ పాపాలాల్!"

"పోనీ లాల్ బాగ్ తెలుసా?..

"నేనెప్పుడూ ఆ పేరే వినలేదు."

నవ్వి బుజంవదిలేశాడు వెంకోబారావు. సర్వీసంతా దొంగలమధ్యే గడిచి పోయింది వెంకోబారావుకి. కాని ఎప్పుడూ ఒక్క అబద్ధంమీద నిలబడ్డ నేరస్థుడు కనిపించలేదు- ఆసీతప్ప తప్ప. అందుకనే వాడంటే వెంకోబారావుకి ముచ్చట.

కోర్టువ్యవహారాల్లో నిజం చెప్పకూడదని, అలా చెప్పక పోవడం తప్పుకాదనీ సీతప్ప నమ్మకం. ఇద్దరే అబద్ధం చెప్పడానికి అర్హత ఉన్నవారు. దొంగలు, రాజకీయ నాయకులు. మొదటి వాళ్లు తమనితాము ఉద్ధరించుకోడానికి, రెండోవాళ్లు దేశాన్ని ఉద్ధరించడానికి అబద్ధాలు చెప్తారు. కనుక అది చెల్లుబాటు అవుతుందని సీతప్ప విశ్వాసం.

“నీ కిటుకులన్నీ నాకిప్పుడు క్షుణ్ణంగా అర్థమయాయిలే. ఈసారి నేరంచేసి తప్పించుకోగలననుకోను”_అని వెనుకనుంచి వెంకోబారావు హెచ్చరించాడు. ఆ మాటలు వినిపించి నవ్వుకున్నాడు సీతప్ప.

నిజానికి యివాళ అంత ఎక్కువగా “ఆకలి” లేదుగాని, వెంకోబారావు మాటలు గుర్తు తెచ్చుకుంటున్నకొద్దీ, ఒక్కసారి తన పరికరాలకి పనిచెప్పాలనిపించింది సీతప్పకి. ఉదయం ఆ ఆలోచన వచ్చివుంటే ఉపవాసం చేసేవాడు. కాని మధ్యాహ్నం నిద్రపోతున్నప్పుడు తట్టింది. అయినా దోషం లేదనుకొన్నాడు.

క్రితంసారి వరహాలచెట్టే తనని జైలుకి పంపించాడు _ తను తీసుకెళ్ళిన వస్తువులకి అయిదింతలు దొంగతనం తనకి అంటగట్టి. పది నెలలు శిక్ష వేయించాడు. అయినా చెట్టిమీద కోపం రాలేదు సీతప్పకి. ఈసారి వాడినే మరొకసారి ఏడిపించాలనుకున్నాడు.

ఆరోజు మధ్యాహ్నం వరహాలచెట్టి కొట్టుముందునుంచి వెళ్తూ బల్లమీద చతికిలబడి “ఓ చుట్ట యిస్తావా వరహాలూ !” అంటే ప్రాణమిత్రుణ్ణి చూసినట్టు పొంగిపోయి స్వయంగా రెండు చుట్టల్ని బహూకరించాడు వరహాల చెట్టి.

“వచ్చావా సీతప్పా ? క్షేమంగా వున్నావా ? అవును గాని, యీసారి నిన్ను కొట్టారట !” అన్నాడు ఆసక్తి తీరక.

“ఇంకా జైళ్లు అంత పాడయిపోలేదు వరహాలూ ! లోపల చాలా మంచివాళ్లే వున్నారు-పోనీ, ఈసారి నాతో

వస్తావేమిటి?"-అంటే చెట్టి పొట్ట కదిలించుకొంటూ పావు గంటసేపు నవ్వాడు.

కొట్టుని మరికాస్త పెద్దదిచేశాడు చెట్టి. మేడ మరో అంతస్థు పెరిగింది. పెద్ద అక్షరాలతో బోర్డు రాయించాడు. మరిద్దరు నౌకర్లు వచ్చారు. ఇదంతా చూశాకే సీతప్పకి 'ఆకలి' కలిగింది.

సాయంకాలమే తీరికగా గదిలో పక్కపరుచుకొని పదకొండు గంటలదాకా మత్తుగా నిద్రపోయాడు. అప్పుడిక బద్ధకంగా వొళ్ళు విరుచుకొని ఉదయం వరహాలశెట్టి ఆప్యాయంగా అందించిన చుట్టని అంటించాడు.

మల్లుపంచె పైకి ఎత్తిగట్టి, లాల్చీ మీదకి మడతపెట్టి పరికరాల సంచీ తీసుకొని బయలుదేరాడు. వీధిచివర టీస్టాలులో టీ తాగి రెండోసినిమా ఆటవదిలేవరకూ బాతాఖానీ వేశాడు.

పదినెలల తర్వాత మళ్ళీ బయలుదేరుతున్నాడేమో చాలా ఉత్సాహంగా వుంది యివాళ! రెండోకప్పు టీ ముగించి చౌకువేపు తొందరగా నడక సాగించాడు.

అక్కడా అక్కడా చెదిరిన నక్షత్రాలమధ్య కనిపించే నల్లటి ఆకాశం పిప్పిపళ్ళ నోరు వికటాట్టహాసానికి విచ్చుకున్నట్టుంది.

దుకాణానికి యినుప తలుపులు వేయించాడు వరహాల చెట్టి. ఇదివరకు కర్ర తలుపులుండేవి. వాటిని అరగంటలో విప్పేశాడు సీతప్ప. ఇప్పుడు ఇనుపతలుపుల్ని చూసి నవ్వుకున్నాడు. "వాటికి తాళాలు బద్దలుకొట్టే శ్రమయినా వుంది.

పీటికా పెడదకూడా లేదు" అనుకొన్నాడు. అయితే వెంటనే వెంకోబారావుమాట గుర్తుకొచ్చింది. తన అలవాట్లన్నీ ఈ పాటికే కాచి వడబోసి వుంటాడు వెంకోబారావు. ఈసారి అతణ్ణి ఏడిపించాలని కోరిక పుట్టింది సీతప్పకి. దొంగతనంలో తెలివితేటలు కనిపించకుండా బండగా, కొత్తపద్ధతిన జరపాలనుకున్నాడు. అనుకొని పక్కవీధిలోకి గోడని కన్నంవేసే ప్రయత్నంలో పడ్డాడు.

పని పూర్తయేసరికి ఒంటిగంట దాటింది. చెట్టిగారి కుక్క అరవడం మరిచిపోయి సీతప్ప దగ్గరికొచ్చి-యజమానికి సేవలు చేసిచేసి విసిగిపోయిన నౌకరులాగ దిగులుపడి నిలుచుంది. పంచె పైకి ఎగగట్టి మెల్లగా దుకాణంలోకి దిగాడు సీతప్ప. ఆ దుకాణం యిదివరకే తనకి బాగా పరిచయం. ఎటు చూసినా ఆహారపదార్థాలు గుట్టలు గుట్టలుగా వున్నాయి. అన్నిటినీ తీరికగా పరికించి చూశాడు సీతప్ప. బంధీ అయిపోయిన సైనికులలాగ ఆ వస్తువులన్నీ తనని జాలిగా చూస్తున్నట్టు తోచింది. వరహాలచెట్టే స్వయంగా వాటిని తన ముందుంచి "నీకు కావలసింది తీసుకో" అని సవినయంగా ప్రార్థిస్తున్నట్టు తోచింది సీతప్పకి. ఒక ఎండుకొబ్బరి ముక్క తీసుకొని నముల్తూ బియ్యపుబస్తామీద కూచొని క్షణకాలం దుకాణమంతా పరికించాడు. దుకాణానికి గదివేపువున్న తలుపువెనక ప్రజలు వూహించలేని దృశ్యం వుంది. వాళ్ళెప్పుడు చూడని కల్తీలేని బియ్యం, కమ్మని నెయ్యి, రాళ్ళు కలపని కందిపప్పు – అన్నీ వంటగదిలో అమర్చినట్టు తీర్చివున్నాయి. చుట్టూ సరుకులమధ్య బియ్యంబస్తామీద తను-

ఈ చెట్టి దొంగవ్యాపారముమీద తీర్పుచెప్పే న్యాయాధికారి ననిపించింది. ఆలోచించినకొద్దీ అతనికి చెట్టిమీదా, ఆ వస్తువుల మీదా జాలి కలిగింది.

బయట నిలబడ్డ కుక్క కన్నంలోకి చొరబడడం తెలీక నిరుత్సాహంతో మూలుగుతోంది. డబ్బాలోంచి ఒక బెల్లం ముక్కతీసి దానివేపు విసిరాడు సీతప్ప. కృతజ్ఞతతో మరొకసారి మూలిగి కడుపు నింపుకొంటోంది_చెట్టిగారిపట్ల కృతజ్ఞతని మరిచిపోయిన కుక్క.

లేచి త్వరత్వరగా తనపనిని ప్రారంభించదలుచుకున్నాడు. మళ్లీ హఠాత్తుగా వెంకోబారావు గుర్తుకొచ్చాడు. ఇప్పుడుకూడా అతన్ని ఏడిపించాలనిపించింది. గల్లాపెట్టి దగ్గరున్న కలం, కాగితం తీసుకుని దేవుడుముందు వెలిగే చిన్న వెలుగులో త్వరత్వరగా రెండువాక్యాలు బరికాడు. "నాకు కావలసింది మాత్రం పట్టుకపోతున్నాను. ఇది పోయినందువల్ల చెట్టిగారికేమీ నష్టంలేదు. కాని నాకుమాత్రం దినం గడుస్తుంది. మామూలుగా అయితే చెట్టి యిందుకు ఒప్పుకుంటాడా మరి!"

కాగితాన్ని గల్లాపెట్టిమీద వుంచాడు. డబ్బేం ముట్టుకోలేదు. తనకు కావలసిన వస్తువుల్ని - సముద్రతీరాన్న న త్తగుల్లల్ని ఏరినట్టు స్వేచ్ఛగా, సంతోషంగా ఓ గోనెకు ఎత్తుకున్నాడు. ఆ ఏరినవాటిలో ఏదీ వృధాచెయ్యలేదు. అనవసరమయినదేదీ ముట్టుకోలేదు. మరీ పెద్దదిగానే మూటని తీసుకుని కన్నందగ్గరికి నడిచాడు.

కుక్క మళ్లీ అభినందిస్తూ మూలిగింది. దాన్ని చూసి మూటదింపి సేరుతో పేలాల్ని దానిముందు గుమ్మరించి - బయటికి వచ్చేశాడు.

అప్పటికి రెండయింది.

మరో అరగంటకి బస్తాని తనగదిలో ఓ మూల పారేసి హాయిగా నిద్రపోయాడు సీతప్ప. అతనికి గాఢంగా నిద్ర పట్టేసింది.

*　　　*　　　*

మర్నాడు పదిగంటలక్కాని తెలివిరాలేదు సీతప్పకి.

ప్రశాంతంగా వొళ్లువిరుచుకు లేచి, స్నానంచేసి, కుదురుగా బొట్టు దిద్దుకొని, లాల్చీవేసుకొని కాఫీ త్రాగడానికి బయలుదేరాడు. అలవాటుప్రకారం దారిలో పేపరు కొనుక్కొని రాత్రి తన కార్యక్రమం పేపరులో వచ్చిందీ లేనిదీ వెదకబోయాడు. కాని వెదికేశ్రమ అతనికి అవసరం లేకపోయింది. మొదటి పేజీలోనే వెక్కిరిస్తున్నట్టు పెద్దఅక్షరాలు కనిపించాయి.

"ప్రఖ్యాత వ్యాపారి వరహాలచెట్టి దుర్మరణం. దుకాణం లూటీ."

చదివి తెల్లబోయాడు సీతప్ప. క్షణకాలం ఆ వార్తని నమ్మలేకపోయాడు. రాత్రిజరిగిన విషయం మరొక్కసారి గుర్తుకు తెచ్చుకున్నాడు. కాని తనఎరికలో ఎక్కడా రక్తపాతం జరిగిన జ్ఞాపకం లేదు.

మరి తను వచ్చేసిన తర్వాత—!?

ఏమయినా చెట్టి దుకాణంలో వస్తువులు తనయింట్లో వుండడం మంచిదికాదు. ఆలోచన తోచగానే చకచకా యింటివేపు నడిచాడు.

ఇంటిగుమ్మంలోనే ఎదురయ్యాడు వెంకోబారావు.

"ఏరా సీతప్పా? ఈసారి పదటి మార్కేశావ్!" అన్నాడు విజయోత్సాహంతో. అతనికి రెండువిధాలుగా సంతోషంగా వుందిప్పుడు. ఎప్పుడూ కనిపించని సీతప్ప పరి కరాల్ని చూసే అదృష్టం కలిగింది. ఇన్నాళ్ళకి అవి చేతికి దక్కాయి. అదీగాక, సీతప్ప యీపాటికి పరారి అయిపోయి వుంటాడనుకొన్నాడు. అలాంటిది అతనూ దొరికిపోయాడు. కథ యింత సులువుగా విడిపోతుందనుకోలేదు వెంకోబా రావు.

"ఏమిటి సార్?" అన్నాడు సీతప్ప.

"దొంగతనమే గాకుండా ఉత్తరాలు రాయడం ఎప్ప ట్నుంచీ నేర్చుకున్నావురా?" అన్నాడు వెంకోబారావు.

సీతప్పకి ఉత్తరం జ్ఞాపకం రాగానే ఎక్కడలేని ధైర్యం వచ్చింది. ధీమాగా అన్నాడు: "ఆ వుత్తరం చదివాక మాకే నిజం అర్థమవుతుందండి" అన్నాడు నిర్లక్ష్యంగా.

వెంకోబారావు నవ్వాడు. "అర్థమయే వచ్చాంరా" కాగితం ముందుకు జాపాడు. పెద్దఅక్షరాలతో వుత్తరాన్ని చూడగానే తుళ్ళిపడ్డాడు సీతప్ప. ఆ అక్షరాలు కొత్తగా వున్నాయి. కాగితమూ కొత్తదే!

చేతుల్లోకి తీసుకొన్నాడు.

"ఉత్త దొంగతనాలే అనుకొన్నాను. ఈసారి చెట్టి గారి మెడకే వేశావు—పైగా మెడకి కాగితం కడతావా?" అంటున్నాడు వెంకోబారావు వ్యంగ్యంగా.

కాగితం చదివాడు.

"మాకు కావలసిందే తీసుకుపోతున్నాం. వీడు పోయినందువల్ల ఎవరికీ ఏమీ నష్టంలేదు. కాని చాలామంది జీవితాలు తృప్తిగా గడుస్తాయి. మామూలుగాఅయితే యిందుకు ఒప్పుకుంటాడా మరి!"

తెల్లబోయాడు సీతప్ప.

అతనికి మరో ఆలోచన వచ్చింది.

"చెట్టిగారికుక్క ఎక్కడుందో వెదకండి సార్—దానికి తెలుసు నేను చేసిన పని."

"దానికే కాదురా—మాకూ తెలుసు—దాని మెడకీ వేశావుగా!" మరో చిన్నచీటీ అందించాడు వెంకోబా—దాని మీద రెండే మాట లున్నాయి. కుక్కసంగతి సరేసరి!"

వెంకోబారావు సీతప్పనే సూటిగా కనిపెడుతున్నాడు. భయం కనిపించవలసిన ముఖంలో ఆశ్చర్యం ఎందుకు కనిపిస్తోందో అతనికి అర్థంకాలేదు.

సీతప్ప తలెత్తితే—

"ఈసారి నువ్వేనా? అని అడగనుతే" అన్నాడు ధీమాగా.

ఉన్నట్టుండి పకాలున నవ్వాడు సీతప్ప.

"ఏం నవ్వుతున్నావు?" అన్నాడు వెంకోబారావు అర్థంకాక.

రెండుకాగితాల్నీ చూస్తూ, "వీ డెవడో మా జాతే లెండి, మా యిద్దరికీ యీ విషయంలో చిన్న అభిప్రాయభేదం వుంది. అంతే. పదండి" అని లేచి ఇనస్పెక్టరువెనక నడిచాడు సీతప్ప.

—వాణిశ్రీ, జూన్, 68.